
సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శ్రీలక్ష్మీకృతి కలగ(సికింద్రాబాద్) శనివారం రూ.1,01,116 విరాళం అందజేశారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం 3,61,255 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు 11,400 క్యూసెక్కుల నీటిని వదిలారు.

5న సామర్లకోటకు సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్ 5వ తేదీన సామర్లకోట రానున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. సామర్లకోట ఈటీసీ జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. - 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి గోదావరి హారతి పునఃప్రారంభం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గోదావరి హారతి కార్యక్రమాన్ని ఆదివారం నుంచి పునరుద్ధరిస్తున్నారు. ఇటీవల వర్షాలు వల్ల కొద్ది రోజులు నిలిపివేశారు. మళ్లీ ఎప్పటిలా గోదావరి హారతిని ప్రారంభించనున్నామని శ్రీపందిరి మహాదేవుడు సత్రం సహాయ కమిషనర్, గోదావరి హారతులు పర్యవేక్షణాధికారి వీవీ.పళ్లంరాజు శనివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. పుష్కర్‌ఘాట్ వద్ద ప్రతిష్టాత్మకంగా దేవదాయ ధర్మదాయ శాఖ, శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రోజూ సాయంత్రం 6.30 గంటలకు గోదావరి హారతి ఇస్తున్న సంగతి తెలిసిందే. భక్తులు, యాత్రీకులు, నగర ప్రజలు ఈ హారతులను తిలకించేందుకు తరలి రావాలని కోరారు.

5 నుంచి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీకే.విశ్వేశ్వరరెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇస్రో ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 8 వరకూ ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ప్రైవేట్ కాలేజీ అసోసియేషన్ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేట్ కాలేజీల అసోసియేషన్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నామన్నారు. చంద్రయాన్-3 విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో వేడుకలకు రాజమహేంద్రవరం కూడా వేదిక కానుందన్నారు. ప్రారంభ రోజు ఉదయం నందం గనిరాజు జంక్షన్ నుంచి ఆనం కళాకేంద్రం వరకు స్పేస్ వాక్ ఉంటుందన్నారు. అన్ని జూనియర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టి పాల్గొంటారన్నారు. 25 మంది ఇస్రో శాస్త్రవేత్తలు హాజరవుతున్నారన్నారు. 6న ఆనం కళాకేంద్రంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ దినేష్ కుమార్ అధ్యక్షతన జరిగే వేడుకలో కలెక్టర్ డా కె మాధవీలత, నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె పద్మరాజు హాజరవుతారన్నారు. 19 మండలాల్లో క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. కళాకేంద్రం ఆవరణలో ఇస్రో రాకెట్ల నమూనాల ప్రదర్శన ఉంటుందన్నారు. 7న 10 మంది ప్రముఖులకు ఇస్రో ఆధ్వర్యంలో సత్కారం చేస్తారన్నారు. విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు, మెమెంటోలు, కిట్లు ఇస్రో అందిస్తుందన్నారు. గంగిరెడ్డి, టి.నాగరత్నం, మురళి, సురేష్, రమేష్, ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు ఎం. శ్రీరామ్మూర్తి, రాజా రమేష్ పాల్గొన్నారు.

రేపు స్పందన రద్దు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): మహాత్మా గాంధీ జయంతి నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదు. జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత శనివారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసు అధికారులతో నేర సమీక్ష

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పోలీస్ కార్యాలయంలో జిల్లా నేర పరిశోధన విభాగం అధికారులతో ఎస్పీ జగదీష్ శనివారం సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారిగా నేరాల తీరుపై ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల పరిశోధన, పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రిపూట ఇంటి నేరాలు, చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలు, సెల్‌ఫోన్ దొంగతనాలు, దారిదోపిడీలు జరగకుండా పాత నేరస్తులపై నిఘా పెంచాలన్నారు. నైట్ గస్తీ, పెట్రోలింగ్ పెంచాలని, నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల వేలు ముద్రలను చెక్ చేయాలన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. క్రైం అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు విద్యాసాగర్, పీవీ.త్రినాథ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నాడు రోత.. నేడు మోతా?

- నాటి కాపు ఉద్యమంలో కంచాలు కొట్టిన వారిపై వేధింపులు
- సెక్షన్ 341 కింద కేసులు పెట్టిన చంద్రబాబు సర్కార్
- ఇప్పుడు కంచాల మోతకు లోకేష్ పిలుపుపై విమర్శలు
- టీడీపీ ద్వంద్వనీతిపై సర్వత్రా విమర్శలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు' అన్నట్టు తెలుగుదేశం నేతలు వ్యవహరిస్తున్నారు. వందల కోట్ల రూపాయల స్కిల్ స్కామ్‌లో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో టీడీపీ అధినేత చంద్రబాబు 21 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. జైలులో ఉన్న చంద్రబాబుకు సంఘీభావంగా కంచాలు కొడుతూ ప్రజాశబ్దం వినిపించాలంటూ లోకేష్ ఇచ్చిన పిలుపు నగుబాటుకు గురవుతోంది. శనివారం రాత్రి ఏడు గంటల నుంచి ఐదు నిమిషాలు పాటు కంచాలు, గరిటెలు, వాహనాల హారన్‌లు, అవేవీ అందుబాటులో లేకపోతే విజిల్స్‌తోనైనా 'ప్రజాశబ్దం' చేయాలని చేసిన ట్వీట్ ఉమ్మడిగోదావరి జిల్లాల్లో చర్చనీయాంశమైంది. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో మరోలా ప్రవర్తించడం టీడీపీ నేతలకు పరిపాటని పరిశీలకులు ఎద్దేవా చేస్తున్నారు.

తమ పార్టీ అధినేత కటకటాలపాలై దిక్కుతోచక తెలుగు తమ్ముళ్లు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గోదావరి జిల్లాలు బలమైనవిగా భావించే పరిస్థితులు టీడీపీకి ఉండేవి. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ జనరంజక పాలనతో ఉనికి కోసం తంటాలుపడుతోంది. చంద్రబాబు జైలులో ఉన్నా జిల్లా ప్రజల సంగతి అటుంచితే పార్టీ నేతల కనీస స్పందన కూడా కొరవడిందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు గగ్గోలు పెట్టడం బహిరంగ రహస్యమే.

ఇదేం వైఖరి

చంద్రబాబు తరహాలోనే ఆ పార్టీ నేతలు రెండు నాలుకల ధోరణి అనుసరిస్తున్నారు. తాము చేస్తే ఒప్పు ఇతరులు చేస్తే తప్పు అనే టీడీపీ నేతల తీరును ప్రజలు గ్రహిస్తున్నారు. 2016లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కాపు ఉద్యమం ప్రధానంగా నాటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉధృతంగా సాగింది. ఆ క్రమంలో జనవరి 31న తుని రైలు దహనం సంఘటన జరిగింది. ఆనాటి సర్కారే తెరవెనుక నడిపిన మంత్రాంగం వల్లే ఈ సంఘటన జరిగిందనే ఆరోపణలు అప్పట్లోనే వినిపించాయి. ముద్రగడ పద్మనాభం **సహా ఆ కుటుంబంలోని మహిళలని కూడా చూడకుండా టీడీపీ సర్కార్ దమనకాండకు పాల్పడింది. దీనిపై కాపు సామాజిక వర్గీయులు శాంతియుత పంథాలో బాబు ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన వ్యక్తం** చేశారు. ఇళ్ల వద్దనే కంచాలు, పళ్లాలు, ప్లేటులను గరిటెలతో దరువు వేస్తూ 'కాపుల ఆకలి కేకలు' అంటూ నినదించారు. శాంతియుతంగా ఇళ్లవద్ద, రోడ్డుకు ఇరువైపులా కూర్చుని కంచాలపై దరువువేసిన వారిపై కేసులు బనాయించింది. మహిళలు, చిన్నారులు అని కూడా చూడకుండా అందరిపైనా సెక్షన్ 341 కింద కేసులు పెట్టింది. సుమారు 400 కేసులు పెట్టింది.

కేసులు ఎత్తివేసిన జగన్

అక్రమ కేసులు ఎత్తేయాలని సామాజికవర్గ నేతలు, యువత వేడుకున్నా చంద్రబాబు సర్కార్ మనసు కరగలేదు. చివరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దమనసు చాటుకున్నారు. గత పాలనలో కాపు ఉద్యమ సందర్భంలో పెట్టిన అక్రమ కేసులన్నింటినీ ఎత్తేశారు. నాడు ఉద్యమంలో భాగంగా కంచాలపై శబ్దాలుచేస్తేనే అక్రమ కేసులు పెట్టి ఇప్పుడు చంద్రబాబుకు మద్దతుగా అదే తరహాలో చేయమని లోకేష్ ట్వీట్ చేయడం సిగ్గు చేటని వివిధ పక్షాలు ఆక్షేపిస్తున్నాయి. అప్పుడు ఆ సామాజికవర్గం న్యాయమైన డిమాండ్ కోసం చేస్తే అక్రమ కేసులతో వేధించి ఇప్పుడు అదే పద్ధతిలో చంద్రబాబుకు సంఘీభావం తెలియచేయమనడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమంటున్నారు.



నాడు కాపు ఉద్యమంలో భాగంగా అమలాపురంలో కంచాలు కొడుతున్న నేతలు (ఫైల్)

వేధించిన వారే కంచాలు కొట్టమంటే ఎలా?



శాంతియుతంగా కంచం శబ్దాలు చేస్తూ ఆందోళన చే స్తే చంద్రబాబు ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టింది. మహిళలని కూడా చూడకుండా వేధించింది. ఎవరి ఇంటి వద్ద వారు కంచాలతో చప్పుడు చేస్తే పెద్ద నేరం చేసినట్టు పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పింది. ఇప్పుడు అవినీతి కేసులో జైలులో ఉన్న చంద్రబాబు కోసం కంచాలతో దరువు వేయాలని లోకేష్ పిలుపు ఇవ్వడం సిగ్గుచేటు.

– అడ్డగర్ల వరలక్ష్మి, పి.గన్నవరం

నాడు ఉక్కుపాదం



కాపు ఉద్యమంపై నాడు ఉక్కుపాదం మోపడమే కాకుండా చంద్రబాబు ప్రభుత్వం ఏడెనిమిది నెలల పాటు పోలీసులను ఉసిగొల్పి వేధించింది. ఉద్యమ నాయకుడు ముద్రగడ కుటుంబంలోని మహిళలను అన్యాయంగా దుర్భాషలాడుతూ ఈడ్చుకుపోయారు. న్యాయమైన డిమాండ్‌తో నిరసన తెలిపితే కేసులు పెట్టిన చంద్రబాబుకు ప్రజలు ఎలా సంఘీభావం తెలుపుతారు?

– దలే చిట్టిబాబు, బోర్డు మెంబర్, అన్నవరం దేవస్థానం

లోకేష్ పిలుపు విస్మయంగా ఉంది



ఎవరింటి వద్ద వారు పిల్లాపాపలతో కంచాలు, ప్లేట్లపై చప్పుడు చేస్తే నాడు కేసులు పెట్టారు. ఇళ్లకు వచ్చి పోలీసులు చాలా ఇబ్బందులకు గురి చేశారు. నేడు వందల కోట్ల రూపాయల అవినీతి కేసులో చంద్రబాబు జైలులో ఉన్నారు. ఇప్పుడు కంచాలు కొట్టండని లోకేష్ కోరడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని అక్రమ కేసులు ఎత్తివేసి మేలు చేశారు.

– సూదా గణపతి, అమలాపురం

స్పిన్నింగ్ మిల్లు విస్తరణ పనులకు 4న శంకుస్థాపన



విస్తరణ పనుల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

పెరవలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 4న ఖండవల్లిలోని రవళి స్పిన్నింగ్ మిల్లులో ఇంటిగ్రేటెడ్ విస్తరణ పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. జిల్లా కలెక్టర్ కె మాధవీలత ఈమేరకు పేర్కొన్నారు. పనుల గురించి ఆమె శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మిల్లులో రూ.150 కోట్లలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ రోటరీ స్పిన్నింగ్ వీరింగ్ కంపెనీకి కేటాయించిన స్థలాన్ని, సమావేశ మందిరాన్ని పరిశీలించామన్నారు. పరిశ్రమ విస్తరణ వల్ల వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా రవళి స్పిన్నింగ్ మిల్లు డైరెక్టర్ వంక రఘువీర్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి బి వెంకటేశ్వరరావులతో ఈ వర్చువల్ సమావేశానికి తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. జేసీ ఎస్ తేజ్ భరత్, కొవ్వూరు ఆర్‌డీఓ ఎస్ మల్లిబాబు, మండల ప్రత్యేక అధికారి ఎస్ సుభాషిణి, తహసీల్దార్ రాజ రాజేశ్వరి, ఎంపీడీఓ దామోదరరావు పాల్గొన్నారు.

జగన్ లక్ష్యం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం
- 45రోజుల పాటు విస్తృతంగా వైద్య సేవలు
- ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్, ఎంపీ



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్. చిత్రంలో కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్



శిబిరంలో విద్యార్థినికి కంటి పరీక్షలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టరు డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. స్థానిక 2వ వార్డు అద్దేపల్లి కాలనీలోని వాంబే గృహాల వద్ద గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపీహెచ్)లో జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ఎంపీ మార్గాని భరత్ రామ్, జాయింట్ కలెక్టరు ఎస్.తేజ్ భరత్, నగరపాలక సంస్థ కమిషనరు కె.దినేష్ కుమార్‌లతో కలసి ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైద్య రంగంలో వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ఐదు దశల్లో 45 రోజుల పాటు ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇంటింటికీ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు వెళ్లి సర్వే చేస్తూ ఏడు రకాల వైద్య పరీక్షలను చేసి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న హెల్త్ స్క్రీనింగ్ ద్వారా గైనకాలజిస్టులతో పాటు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, చిన్న పిల్లల డాక్టరు, ఆర్థోపెడిక్స్, నేత్ర వైద్యులు శిబిరంలో పాల్గొంటారన్నారు. 104 వాహనంలో గుండెకు సంబంధించి ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు.

పాత రిపోర్టులు అవసరం లేదు

సర్వే రిపోర్టుల తర్వాత రోగులకు ముందస్తు సమాచారమిచ్చి శిబిరంలో పాల్గొనేందుకు టోకెన్ ఇస్తారని కలెక్టర్ చెప్పారు. శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులు పరీక్షించాక అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారన్నారు. శస్త్ర చికిత్స అవసరమైతే ఆరోగ్య శ్రీ ద్వారా రిఫరల్ ఆసుపత్రికి సిఫార్సు చేస్తారన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చూడాలన్నదే సీఎం జగనన్న సంకల్పమన్నారు. శిబిరాల్లో నిశితంగా పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. 45 రోజుల పాటు ఈ సేవలందుతాయన్నారు. గతంలో చేయించుకున్న పరీక్షల వివరాలు అక్కర్లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేస్తోందన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో ఏ ఆసుపత్రికి వెళ్ళినా ఉచితంగా వైద్యం అందజేస్తారన్నారు. స్వతహాగా వైద్యులైన రాజమహేంద్రవరం అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పలువురు రోగుల ఆరోగ్యాన్ని పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర రావు, డీసీహెచ్‌వో డాక్టర్ సనత్ కుమారి, ఆర్‌యంసీ మెడికల్ అధికారి డాక్టర్ వి.వినూత్న, నగర వైసీపీ అధ్యక్షులు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

హైవే ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ



హైవేలపై బ్లాక్‌స్పాట్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలోని నేషనల్ హైవేపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పి.జగదీశ్ తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను జిల్లా ఎస్పీ శనివారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను అధికారులకు వివరించారు. శుక్రవారం రాత్రి రాజానగరం నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. జిల్లాలో పలుచోట్ల హైవేపై చాలామంది ప్రజలు ప్రమాదాలలో ఇలా నిత్యం మృత్యువాత పడడం ఎస్పీ గమనించారు. రాజానగరం హైవే దగ్గర ప్రమాద ప్రదేశాన్ని సందర్శించి ఇక్కడి లోపాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి రోజూ నేషనల్ హైవేపై ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారన్నారు. మరి కొందరు గాయపడుతున్నారన్నారు. ఈ ప్రమాదాలు జరగకుండా అడ్డుకట్ట వేయడానికి. నేషనల్ హైవే అథారిటీతో సంప్రదించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. వీటిపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో బ్లాక్ స్పాట్ హెచ్చరిక బోర్డులను పెంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఎస్పీ యం.కిశోర్‌కుమార్, బొమ్మూరు సీఐ ఆర్.విజయ్ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సానుభూతి డ్రామాలకు తెరదించండి

- చంద్రబాబు కుటుంబ సభ్యులకు జక్కంపూడి రాజా హితవు



పశ్చిమగానుగూడెం వైద్యశిబిరంలో గర్భిణులు, బాలింతల పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు సాక్ష్యాధారాలతో దొరికిపోయారని, ఈ అంశంపై ఆయన కుటుంబ సభ్యులు సానుభూతి కోసం నిరాధారమైన ప్రకటనలు చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా హితవు పలికారు. కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.371 కోట్ల ప్రజాధనాన్ని షెల్ కంపెనీల్లోకి చంద్రబాబు మళ్లించి స్వాహా చేశారన్నారు. షెల్ కంపెనీలను సృష్టించి నగదును విడుదలచేసి, తిరిగి ఖాతాల్లోకి మళ్లించుకున్నారన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట అయి బాబు ఇంత సులభంగా దొరుకుతారిని ఊహించకపోవడం అహంభావానికి సంకేతమన్నారు. కేసులో ఆధారాలుండటంతోనే కోర్టు నిందితునికి రిమాండ్ విధించిందన్నారు. ఆధారాలు లేవనే టీడీపీ నేతల నిరాధారమైన వాదనలను రాజా కొట్టిపడేశారు. చంద్రబాబు కోసం మహిళలను అడ్డుపెట్టుకుని సానుభూతి డ్రామాలకు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. 2019లోనే ప్రజలు తిరస్కరించారని టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమన్న విషయాన్ని బాబు కుటుంబ సభ్యులు గ్రహించాలన్నారు. చంద్రబాబు 35 సంవత్సరాల రాజకీయ జీవితంలో వెన్నుపోట్లు, అవినీతి ఆరోపణలు, అక్రమాలు, ప్రజాధనం దోపిడీ తప్ప ప్రజలకు మంచి చేసిన దాఖలాలు లేవన్నారు. కేంద్రప్రభుత్వ జీఎస్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదాయపన్ను శాఖల వద్ద చంద్రబాబు కేసుపై స్పష్టమైన ఆధారాలున్నాయన్నారు. ఇందులో భాగంగానే సీఐడీ కేసు నమోదు చేసిందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని రాజా తెలిపారు. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలో ఆయన తనయుడు కూడా పేదల ఇంటి వైద్యుడయ్యారన్నారు. ఇప్పటికే సర్వేలో రోగులను గుర్తించారన్నారు. వారికి శిబిరాల ద్వారా సంపూర్ణమైన చికిత్స అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అడబాల చినబాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు గణేశుల పోసి(కోరుకొండ),దూలం పెద్ద(రాజానగరం), పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


ప్రమాదంలో నుజ్జయిన కారు

రాజానగరం: అసలే మద్యం మత్తులో ఉన్నారు, ఆపై అతి వేగం.. రాంగ్ రూటులో ప్రయాణం.. ఫలితంగా ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. జాతీయ రహదారిపై స్థానిక బైపాస్ రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తుని మండలం హంసవరానికి చెందిన సాపాశెట్టి గణేష్ (29), రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన ఉడత సాయి (22) బైక్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. ఏడీబీ రోడ్డు నుంచి వారు జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలోకి మళ్లాల్సి ఉంది. కానీ మద్యం మత్తులో ఉన్న వారికి ఏది ఏ రూటో తెలియలేదో ఏమో! రాంగ్ రూటులో రాజమహేంద్రవరం నుంచి వచ్చే రోడ్డు పైకి బైకును పోనిచ్చారు. ఈ క్రమంలో డివైడర్‌ను ఆనుకుని కొద్ది దూరం వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న కారు.. వారిని తప్పించబోయి, ఢీకొని రోడ్డుకు అడ్డంగా దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బైక్ బోల్తా పడింది. బైక్ నడుపుతున్న గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయి మృతి చెందాడు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రాజానగరం పోలీసులు తెలిపారు.

5న సామర్లకోటకు సీఎం జగన్

- జగనన్న లే అవుట్ ఇళ్లు ప్రారంభం
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు వెల్లడి


విలేకర్లతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్టోబర్ 5వ తేదీన సామర్లకోట రానున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. సామర్లకోట ఈటీసీ జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. అక్కడ ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, పార్కులను ప్రారంభిస్తారని తెలిపారు. జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారులతో ముచ్చటిస్తారని అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దొరబాబు మాట్లాడారు. విజయవాడ నుంచి సామర్లకోట – పెద్దాపురం రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సమీపాన ప్రైవేటు లే అవుట్‌లో ఏర్పాటు చేసే హెలిపాడ్‌కు చేరుకునే సీఎం జగన్.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జగనన్న కాలనీకి చేరుకుంటారని వివరించారు. జగనన్న కాలనీ సందర్శన అనంతరం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా సామర్లకోట వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దొరబాబు పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరో 15 రోజుల్లో ఇంటింటా జగనే కావాలి కార్యక్రమం ప్రారంభమవుతుందని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ, సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పి.సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని భక్తులకు కొత్త క్యూ కాంప్లెక్స్

- కార్తికం నాటికి అందుబాటులోకి..
- ఆలయం చుట్టూ ఒకే ఎత్తున ఆవరణ
- ఈఓ చంద్రశేఖర్ ఆజాద్


అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్


శివసదన్ సత్రం పార్కింగ్ స్థలంలో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందీ పడకుండా స్వామివారిని దర్శించేందుకు వీలుగా కొత్త క్యూ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. దీనిని వచ్చే కార్తిక మాసం నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. రత్నగిరిపై పలు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, రూ.800 వ్రత మండపాల మీద స్వామివారి ఆలయానికి దగ్గరలో.. నూతన రూ.2 వేల వ్రత మండపం వెనుక 150 అడుగుల పొడవు, 19 అడుగుల వెడల్పున విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించనున్నామని తెలిపారు. గతంలో స్వామివారి వంటశాల షెడ్డు నిర్మాణానికి టెండర్ పిలిచామని, అయితే దీని నిర్మాణానికి దాత ముందుకు వచ్చారని చెప్పారు. అందువలన వంటశాలకు కేటాయించిన మొత్తాన్ని విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తామని అన్నారు. సగం షెడ్డు నిర్మాణానికి ఈ మొత్తం సరిపోతుందని, మిగిలిన భాగం నిర్మాణానికి టెండర్ పిలుస్తామని వివరించారు. భక్తుల క్యూ షెడ్డు ఏసీ చేయిస్తామని, దీనివలన స్వామి వారి దర్శనం ఆలస్యమైనా భక్తులకు ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ క్యూ షెడ్డులో భక్తులు కూర్చునేందుకు కూడా అక్కడక్కడ బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీరు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం సత్యదేవుని ఆలయానికి ఉత్తరం వైపు మండపం శ్లాబ్ ఎత్తు, ఆలయం వెలుపల శ్లాబ్ కన్నా చాలా ఎత్తుగా ఉందని, ఇది వాస్తు విరుద్ధమని ఈఓ తెలిపారు. అందువలన ఈ శ్లాబ్‌ను రెండడుగుల మేర తగ్గించి, ఆలయం చుట్టూ ఒకే ఎత్తులో శ్లాబ్ ఉండేలా చేస్తామని వివరించారు. ఓల్డ్ సీఆర్ఓ వెనుక 30 మీటర్ల వెడల్పు, 400 మీటర్ల పొడవున బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లతో పిలిచిన టెండర్‌కు కమిషనర్ ఆమోదం తెలిపారని చెప్పారు. త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణం ప్రారంభించి, కార్తికం నాటికి పూర్తి చేస్తామని వివరించారు. ఇటీవల కూల్చివేసిన 30 వీఐపీ సత్రం వ్యర్థాలు మూడు రోజుల్లో తరలించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఈఓ ఆదేశించారు. ఈ స్థలంలో రూ.1.99 కోట్లతో 180 అడుగుల పొడవు, 150 అడుగుల వెడల్పున షెడ్డు నిర్మాణానికి సికింద్రాబాద్‌కు చెందిన లారెల్స్ ల్యాబ్ ప్రతినిధులు ఇప్పటికే శంకుస్థాపన చేశారన్నారు. వ్యర్థాలను తొలగించి, స్థలం చదును చేసి, అప్పగించిన వెంటనే షెడ్డు నిర్మాణం ప్రారంభిస్తారని ఈఓ తెలిపారు. సత్యగిరిపై 138 గదులతో నిర్మిస్తున్న శివసదన్ సత్రం పార్కింగ్ స్థలంలో కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులు చురుకుగా జరుగుతున్నాయని, మరో నాలుగు రోజుల్లో పూర్తవుతాయని ఈఓ ఆజాద్ తెలిపారు. ఇంజినీరింగ్ ఈఈ నరసింహరెడ్డి, డీఈ రాంబాబు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

వాడపల్లి.. భక్తజన వాహిని..


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. సుమారు 35 వేలు మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల వ్రతం ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.30,61,492 ఆదాయం సమకూరింది.


ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 4న శంకుస్థాపన

మధురపూడి: కోరుకొండ మండలం రాజవరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు ఈ నెల 4న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఈ విషయం తెలిపారు. రాజవరంలో యూనిట్ నిర్మించ తలపెట్టిన ప్రదేశాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యాన జిల్లాలో యూనిట్లు అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో రూ.4.45 కోట్ల సిడ్బీ ఆర్థిక సహాయంతో ఈ యూనిట్ ఏర్పాటవుతుందని వివరించారు. కలెక్టర్ వెంట, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, ఆర్డీఓ చైత్ర వర్షిణి, కోరుకొండ తహసీల్దార్ పి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

హర్షకుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్: కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఆ పార్టీ రాష్ట్ర నేతలపై మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ చేసిన ఆరోపణలను జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. అమలాపురంలోని దక్షిణామూర్తి వీధిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా సమావేశం హర్షకుమార్ తీరుపై ధ్వజమెత్తింది. తక్షణమే ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధిష్టానాన్ని డిమాండ్ చేసింది. రాజమహేంద్రవరంలో హర్షకుమార్.. మీడియాతో చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడి, ఆ పార్టీ కోసం పాకులాడుతున్నట్లు కనిపించిందని ప్రభాకరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలు కేవీపీ రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి వంటి వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం హర్షకుమార్‌కు తగదని సమావేశం స్పష్టం చేసింది. హర్షకుమార్‌కు ఎప్పుడూ నెగెటివ్ ఆలోచనలు తప్ప పాజిటివ్ ఆలోచనలు ఉండవని విమర్శించారు. వేరే పార్టీలోకి వెళ్లాలంటే జిల్లా పార్టీలో ఎవ్వరికీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గంటి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ పరీక్షల్లో రమ్యశ్రీకి 18వ ర్యాంకు


రమ్యశ్రీని అభినందిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సీఎంఏ–2023 పరీక్షల్లో అమలాపురానికి చెందిన అడ్డగర్ల రమ్యశ్రీ జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు సాధించింది. దేశ వ్యాప్తంగా వేలాదిగా విద్యార్థులు హాజరైన ఈ పరీక్షల్లో అతి తక్కువ మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో బీకాం చదివిన రమ్యశ్రీ గుంటూరులో సీఎంఏ శిక్షణ పొందింది. జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన రమ్యశ్రీని గుంటూరు శ్రీమేధా అకాడమీ డైరెక్టర్ కేఎస్‌టీ కిషోర్ శనివారం అభినందించారు. రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. రమ్యశ్రీని ఎస్‌కేబీఆర్ కళాశాల అధ్యాపకులతో పాటు వివిధ విద్యా సంస్థల యాజమాన్య ప్రతినిధులు కూడా అభినందించారు.

కాలువలో మహిళ మృతదేహం లభ్యం

నల్లజర్ల: భర్తతో గొడవ పడి అనంతపల్లి వద్ద పోలవరం కాలువలో దూకిన కస్తూరి (24) మృతదేహం శనివారం శింగరాజుపాలెం శివారులో లభ్యమైందని ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఆమె ఆచూకీ కోసం ఎన్‌డీఆర్ఎఫ్ దళాలతో పాటు గజ ఈతగాళ్లు పోలవరం కాలువలో గాలించారన్నారు. కస్తూరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించామని చెప్పారు.